సాక్షి సంగారెడ్డి

గురువారం । 5 । జూన్ । 2025



పర్యావరణ హితులం..
వర్గల్ మండల మహిళలు విస్తరాకులు కుడుతూ పర్యావరణానికి మేలు కలిగిద్దామంటూ నందేశమిస్తున్నారు.
వివరాలు 10లో ▸



రాళ్ల భూములు...
రాళ్ల భూములను ఖేడ్ డివిజన్‌లోని పలు మండలాల రైతులు నల్లరేగడి భూములుగా మార్చుకుంటున్నారు.
వివరాలు 10లో ▸



సాగుకు తొందరొద్దు
ముందస్తు వర్షాలకు మురిసిపోయి వెంటనే సాగు పనులు చేపట్టొద్దని వ్యవసాయ నిపుణులు రైతులకు సూచిస్తున్నారు.
వివరాలు 11లో ▸

జిల్లా వ్యవసాయాధికారితో 'సాక్షి' ఫోన్ ఇన్

సంగారెడ్డి జోన్: వానాకాలం సీజన్‌లో పంటల సాగు, విత్తనాల ఎంపిక, తీసుకోవాల్సిన జాగ్రత్తలతోపాటు ఎరువుల వినియోగం తదితర సందేహాలు తీర్చుకునేందుకు 'సాక్షి' ఆధ్వర్యంలో జిల్లా వ్యవసాయాధికారి శివప్రసాద్‌తో ఈనెల 6న ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు 'ఫోన్ ఇన్' కార్యక్రమం నిర్వహిస్తున్నారు. రైతులు ఆయనతో మాట్లాడి తమ సందేహాలను నివృతి చేసుకోవచ్చు.





తేదీ : 06-06-2025
సమయం : ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు

ఫోన్ చేయాల్సిన నంబర్లు :
9949992039, 9505872923

న్యూస్‌రీల్

అరుణాచలంకు ప్రత్యేక బస్సులు

నారాయణఖేడ్: ఈనెల 11న పౌర్ణమిని పురస్కరించుకుని ఖేడ్ నుంచి అరుణాచలంకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు ఆర్టీసీ డీఎం మల్లేశయ్య తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. మధ్యలోని మరో మూడు పుణ్యక్షేత్రాలను దర్శించుకునేలా ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా అవసరమైనన్ని బస్సులు నడిపేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. బస్సులు ఈ నెల 9న సాయంత్రం 4 గంటలకు ఖేడ్ నుంచి అరుణాచలంకు బయలుదేరుతాయన్నారు. 10వ తేదీ ఉదయం కాణిపాకం, సాయంత్రం గోల్డెన్‌టెంపుల్ దర్శించుకుని అక్కడి నుంచి బయల్దేరి 11న పౌర్ణమినాడు ఉదయం అరుణాచలం చేరుకుంటాయని తెలిపారు. గిరి ప్రదక్షిణ అనంతరం 12న ఉదయం జోగుళాంబ తల్లి అమ్మవారి శక్తి పీఠం దర్శించుకున్నాక బయల్దేరి అదేరోజు సాయంత్రం 4 గంటలకు ఖేడ్‌కు చేరుకుంటాయని తెలిపారు. రాను పోనూ ఒకొక్కరికీ రూ.4,500 చార్జీ ఉంటుందన్నారు. టికెట్లు బుక్ చేసుకునేందుకు 9959223170, 9441071134, 9676667703, 9063417294 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

కొనసాగుతున్న భూభారతి సదస్సులు



అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ పరమేశం

జిన్నారం (పటాన్‌చెరు): ఉమ్మడి జిన్నారం, గుమ్మడిదల మండలాల్లో భూభారతి సదస్సులు రెండవ రోజు కొనసాగుతున్నాయి. జిన్నారం మండలంలోని అండూర్, బొల్లారం మున్సిపాలిటీలో తహసీల్దార్ దేవదాసు ఆధ్వర్యంలో గుమ్మడిదల మండలంలో అనంతారం గ్రామాల్లో తహసీల్దార్ పరమేశం రైతుల సమక్షంలో సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా భూసమస్యలపై రైతుల నుంచి జిన్నారం మండలంలో 96, గుమ్మడిదల మండలంలో 16 అర్జీలు అధికారులకు అందజేశారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల రైతులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లపై విచారణ



ప్రభుత్వ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలో విచారణ చేస్తున్న అధికారులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని కొల్లూర్ ప్రభుత్వ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల వద్ద బుధవారం అధికారులు విచారణ చేపట్టారు. ప్రభుత్వం ఇళ్లను కేటాయించి లబ్ధిదారుల్లో ఎంతమంది ఇళ్లలోకి వచ్చారు? ఎవరైనా లబ్ధిదారులకు కేటాయించిన ఇళ్లను అద్దెకిచ్చారా? వంటి అంశాలపై ఆరా తీశారు. అదే విధంగా ఎంతమంది లబ్ధిదారులు ఇప్పటి వరకు కేటాయించిన ఇళ్లలోకి రాలేదన్న విషయంపై విచారణ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఆర్‌ఓ వెంకటరామయ్య, ఆర్ఐ శ్రీకాంత్, హౌసింగ్ ఏఈ సత్యనారాయణ పాల్గొన్నారు.

ఆ సీటు మాకొద్దు బాబోయ్!

నీటి పారుదల శాఖ ఎస్‌ఈ పోస్టుపై అధికారుల అనాసక్తి
- బాధ్యతలిస్తే సెలవు పెడతానంటున్న ఓ అధికారి
- ఏసీబీ దాడులు.. రాజకీయ ఒత్తిళ్లే కారణమా?
- సీఈ ధర్మపై ఇటీవల వేటు వేసిన ప్రభుత్వం



నీటిపారుదలశాఖ పర్యవేక్షక ఇంజనీర్ కార్యాలయం

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి : నీటి పారుదలశాఖ పర్యవేక్షక ఇంజనీర్ (ఎస్‌ఈ)గా పనిచేసేందుకు ఆ శాఖ అధికారులు ఆసక్తి చూపడం లేదు. ఈ సీటు మా కొద్దు బాబోయ్ అంటే మాకొద్దని ఇన్‌చార్జి బాధ్యతలు తీసుకునేందుకు ముఖం చాటేస్తున్నారు. దీంతో వారం రోజులు గడుస్తున్నప్పటికీ ఈ పోస్టులో ఏ అధికారికీ ఇన్‌చార్జి బాధ్యతలు గానీ, ఎఫ్ఏసీగానీ ఇవ్వలేదు. ఇక్కడ ఎస్ఈగా పనిచేసిన ఏసయ్య ఐదు రోజుల క్రితం (మే 31)న పదవీ విరమణ చేసిన విషయం విదితమే. దీంతో ఈ పోస్టు ఖాళీ అయింది. ఇప్పటివరకు ఈ పోస్టులో ఎవరినీ నియమిస్తూ ఉత్తర్వులు రాలేదు. ఇదే కార్యాలయంలో పనిచేస్తున్న అధికారికి ఇన్‌చార్జిగా నియమించాలని భావించారు. కానీ, ఆయన కూడా పోస్టులో పనిచేసేందుకు ఆసక్తి చూపలేదు. తప్పనిసరి పరిస్థితుల్లో బాధ్యతలు ఇస్తే సెలవుపై వెళ్లిపోతానని సదరు అధికారి తేల్చి చెప్పినట్లు ఆ శాఖ వర్గాలు చెబుతున్నాయి. అలాగే సంగారెడ్డి సీఈ కార్యాలయంలో పనిచేస్తున్న డిప్యూటీ చీఫ్ ఇంజనీర్ పోస్టులో ఉన్న అధికారి పేరు ఎస్ఈ పోస్టుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు వెళ్లాయి. కానీ, ఆశాఖ ఈఎస్‌సీ కార్యాలయం ఈ ప్రతిపాదనలను పక్కన పెట్టినట్లు తెలుస్తోంది. దీంతో జిల్లాలో వివిధ డివిజన్లలో పనిచేస్తున్న ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ల పేర్లు పరిశీలనలో ఉన్నాయి. ఇందులో సంగారెడ్డి, నారాయణఖేడ్ డివిజన్ల ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లలో ఒకరికి ఈ బాధ్యతలు అప్పగించే అవకాశాలున్నాయని ఆ శాఖ వర్గాలు పేర్కొంటున్నాయి. అయితే ఇందులో ఓ ఈఈ ఇప్పటికే హైదరాబాద్‌కు బదిలీ చేసుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో ఎస్ఈ పోస్టులో ఎవరిని నియమిస్తారనే దానిపై ఆసక్తి నెలకొంది.

కొనసాగుతున్న సింగూరు కాలువల పనులు

ఎస్ఈ కార్యాలయం పరిధిలో మొత్తం నాలుగు డివిజన్లు ఉన్నాయి. సంగారెడ్డితోపాటు, జహీరాబాద్, నారాయణఖేడ్, దౌల్తాబాద్ డివిజన్లు ఉన్నాయి. ప్రస్తుతం నీటి పారుదల శాఖలో పలు అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి. సింగూరు కాలువల ఆధునీకరణ పనులు జరుగుతున్నాయి. సుమారు రూ.200 కోట్లతో ఈ కాలువలకు సిమెంట్ లైనింగ్ పనులు చేస్తున్నారు. మరోవైపు సంగమేశ్వర, బసవేశ్వర పనులు గత ప్రభుత్వ హయాంలోనే ప్రతిపాదనలు ఉండగా ప్రస్తుతానికి ఈ రెండు ఎత్తిపోతల పథకాల పనులు మొక్కుబడిగా సాగుతున్నాయి. మరోవైపు వర్షాకాలం ప్రారంభమైంది. ఈ పనులను ఎస్ఈ ఎప్పటికప్పుడు పర్యవేక్షించాల్సి ఉంటుంది. దీంతో ఎస్ఈ పోస్టు ప్రాధాన్యత సంతరించుకుంది.

రాజకీయ ఒత్తిళ్లే కారణమా?

నీటిపారుదలశాఖ అధికారులపై తీవ్ర రాజకీయ ఒత్తిళ్లు ఉన్నాయి. ప్రధానంగా చెరువులు, కుంటలకు ఎన్‌ఓసీల జారీల విషయంలో నేతల నుంచి ఒత్తిళ్లు తీవ్రమవుతున్నాయి. మరోవైపు చెరువుల్లో మట్టి తవ్వకాల అనుమతుల కోసం కూడా ప్రజాప్రతినిధుల నుంచి ఫోన్లు వస్తుంటాయి. మరోవైపు సంగారెడ్డి చీఫ్ ఇంజనీర్ ధర్మపై ఇటీవల బదిలీవేటు పడిన తెలిసిందే. ఈ నేపథ్యంలో ఇలాంటి కీలకమైన ఎస్ఈ పోస్టులో పనిచేసేందుకు ఆ శాఖ అధికారులు పెద్దగా ఆసక్తి చూపడం లేదు. అలాగే గుమ్మడిదల ఏఈగా పనిచేస్తున్న అధికారిని ఇటీవల ఏసీబీ ట్రాప్ చేసింది. ఓ నిర్మాణానికి ఎన్‌ఓసీ జారీ విషయంలో లంచం డిమాండ్ చేయడంతో ఏఈని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఇలా నీటిపారుదల శాఖలో అధికారుల తీరు చర్చనీయాంశంగా మారుతున్న తరుణంలో ఎస్ఈ పోస్టులోకి వచ్చేందుకు అధికారులు ఆసక్తి చూపడం లేదు. ఈ నేపథ్యంలో జిల్లాలో పనిచేస్తున్న అధికారులకే ఈ బాధ్యతలు ఇస్తారా..? లేదా పక్క జిల్లాలో పనిచేస్తున్న అధికారిని ఇక్కడి ఎస్ఈగా నియమిస్తారా? అనేది కొద్దిరోజుల్లోనే స్పష్టత వచ్చే అవకాశాలున్నాయి.



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

మ్యాప్ రూపొందించాలి

పోలింగ్ కేంద్రాలపై కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి జోన్: గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పోలింగ్ కేంద్రాల భౌగోళిక సమాచారం, సౌకర్యాలు, రవాణా మార్గాల భౌగోళిక మ్యాప్ (నజరీ నక్ష) రూపొందించాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి అధికారులను ఆదేశించారు. కలెక్టరు క్యాంపు కార్యాలయంలో బుధవారం ఆమె అధికారులతో సమీక్ష నిర్వహించారు. కొత్తగా ఏర్పడే పోలింగ్ కేంద్రాలకు బీఎల్‌ఓలను నియమించాలని స్పష్టం చేశారు. ఓటర్ల ఇంటింటి సర్వే నిర్వహణ, పోలింగ్ కేంద్రాల పెంపు వివరాలు, కుటుంబ సభ్యులు అందరూ ఒకే పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కు వినియోగించుకునేలా చర్యలు తీసుకుని వాటిని ప్రభుత్వానికి అందజేయాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ మాధురి, పటాన్‌చెరు నియోజకవర్గం ప్రత్యేక అధికారి దేవుజా, నియోజవర్గ పరిధిలోని తహసీల్దార్లు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

సంగారెడ్డికి కొత్త కమిషనర్

- బల్దియాలో ఒక్కరోజులో హైడ్రామా
- పాత కమిషనర్ సరెండర్
- హడావుడిగా బాధ్యతలు స్వీకరించిన కొత్త కమిషనర్



బాధ్యతలు స్వీకరిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

సంగారెడ్డి : ప్రస్తుతం సంగారెడ్డి కమిషనర్‌గా పనిచేస్తున్న ప్రసాద్ చౌహాన్‌ను ప్రభుత్వం సరెండర్ చేసింది. ఆయన స్థానంలో ప్రస్తుతం దుబ్బాక కమిషనర్‌గా పనిచేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి నియమించింది. దీంతో శ్రీనివాస్‌రెడ్డి రాత్రికి రాత్రే హడావుడిగా సంగారెడ్డి కొత్త కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించారు. బల్దియా సిబ్బంది కోరిక మేరకు వారందరినీ మంగళవారం మహారాష్ట్రలోని తుల్జాపూర్ దేవాలయానికి తీసుకెళ్లారు. అయితే పనిదినాల్లో కొంతమంది సిబ్బంది కార్యాలయంలో లేకపోవడంతో విధులకు ఆటంకం కలిగినట్లు అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ దృష్టికి రాగా, ఈ విషయాన్ని ఆయన సీరియస్‌గా తీసుకున్నారు. పని దినాల్లో సిబ్బందిని టూర్‌కు తీసుకెళ్లిన కమిషనర్ ప్రసాద్ చౌహాన్‌ను కమిషనర్ కార్యాలయానికి సరెండర్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

రైతు మహోత్సవానికి రారండి..

రేపటి నుంచి హుస్నాబాద్‌లో కిసాన్ మేళా
- మేళాను ప్రారంభించనున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి రాధిక

హుస్నాబాద్: రైతు మహోత్సవం సందర్భంగా కిసాన్ మేళాను హుస్నాబాద్ పట్టణంలో పెద్ద ఎత్తు న నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేశారు. ఈ నెల 6, 7, 8వ తేదీల్లో వ్యవసాయ మార్కెట్ యార్డులో మేళా నిర్వహించనున్నారు. వివిధ రకాల వ్యవసాయ యంత్రాలపై అవగాహన కోసం స్టాళ్లను ఏర్పాటు చేశారు. మొదటి రోజు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌లు కలిసి మేళాను ప్రారంభించనున్నారు. వీరితో పాటు ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, మెదక్ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖ, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిలు హాజరుకానున్నారు.

108 స్టాళ్లు..

కిసాన్ మేళాలో వ్యవసాయ, ఉద్యాన, పశుసంవర్ధక, మత్స్య శాఖ విభాగాలు, బ్యాంకులు, ఎఫ్‌పీఓలు, స్టార్టప్ కంపెనీలు, వ్యవసాయ అనుబంధ రంగాల ప్రైవేట్ కంపెనీలకు సంబందించిన 108 స్టాళ్లను ఏర్పాటు చేస్తున్నారు. కార్యక్రమంలో ఆధునిక వ్యవసాయ పరికరాలు, డ్రోన్లు, రోబోటిక్ యంత్రాలు, సేంద్రియ ఎరువులు, ఫెస్టిసైడ్, హార్టికల్చర్, సెరికల్చర్, ఆయిల్‌పామ్, వివిధ రకాల పంటల విత్తనాలను ప్రదర్శిస్తారు. కొత్త పద్ధతులు, సాగు ఖర్చు తగ్గించే విధానాలు, వివిధ పంటల్లో అధిక దిగుబడులకు పాటించాల్సిన మెలకువలపై వ్యవసాయ శాస్త్రవేత్తలు అవగాహన కల్పిస్తారు.

సద్వినియోగం చేసుకోండి

మూడు రోజుల పాటు జరిగే కిసాన్ మేళా కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి. వివిధ రకాల విత్తనాలు, ఆధునిక పరికరాల ప్రదర్శన ఉంటుంది. రోజూ వివిధ శాఖల అధికారులతో వర్క్‌షాపుతో పాటు శాస్త్రవేత్తల ద్వారా ముఖాముఖి నిర్వహిస్తున్నాం. ఆధునిక పద్ధతులపై అవగాహన కల్పిస్తాం. రైతులను తరలించడానికి ప్రత్యేక రవాణా సౌకర్యం కల్పించాం.

– రాధిక, జిల్లా వ్యవసాయ అధికారి

సొంతింటి కల నెరవేరుస్తాం

ఎమ్మెల్యే సంజీవరెడ్డి



ఇందిరమ్మ ఇళ్ల పనులు ప్రారంభిస్తున్న సంజీవరెడ్డి

కల్హేర్(నారాయణఖేడ్): ఇందిరమ్మ ఇళ్లతో పేదలకు సొంతింటి కల నెరవేరుస్తామని ఎమ్మెల్యే పి.సంజీవరెడ్డి పేర్కొన్నారు. కల్హేర్, మార్డి, బీబీపేట్, ఫత్తేపూర్, పోమ్యానాయక్ తండాలో బుధవారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పనులకు ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులందరికీ ఇళ్లు మంజూరు చేస్తుందన్నారు. లబ్ధిదారులకు ప్రభుత్వం వెంటనే బిల్లులు చెల్లిస్తుందని తెలిపారు. ఎవరైనా మిగిలి ఉంటే ఇళ్లు మంజూరు చేస్తామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రమేశ్‌బాబు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బూర్గుల పోచయ్య, మాజీ సర్పంచ్ లక్ష్మినారాయణ, నాయకులు తుకారాం, దేవదాస్, వీరశెట్టి, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

అర్హులైన పేదలకు ఇళ్లు పంపిణీ

కంగ్టి(నారాయణఖేడ్): ఇళ్లు లేని ప్రతీ పేదవారికి ఇందిరమ్మ ఇళ్లు కట్టించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే సంజీవ్‌రెడ్డి పేర్కొన్నారు. కంగ్టి మండలంలోని రాంతీర్థ్, ఎన్కెమూరి గ్రామాల్లో ఎమ్మెల్యే అర్హులైన పేదలకు ఇళ్లు పంపిణీ చేశారు. గూడు లేని పేదలందరికి ఇళ్లు ఇవ్వడమే తమ ప్రభుత్వ లక్ష్యం అని అన్నారు. అనంతరం పలు గ్రామాల్లో సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీడీఓ సత్తయ్య, ప్రత్యేకాధికారి నూతన్ కుమార్, ఏఈ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీలు పూర్తిస్థాయిలో అమలు

మంత్రి దామోదర రాజనర్సింహ



సమీక్షలో మాట్లాడుతున్న మంత్రి దామోదర రాజనర్సింహ. చిత్రంలో కలెక్టర్ క్రాంతి తదితరులు.

సంగారెడ్డి జోన్: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీల హామీలను నిష్పక్షపాతంగా, అర్హులైన వారికి పూర్తిస్థాయిలో అమలు చేయాలని మంత్రి దామోదర రాజనర్సింహ స్పష్టం చేశారు. జిల్లా పరిషత్తు కార్యాలయంలో ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై జిల్లా కలెక్టరు వల్లూరు క్రాంతితో పాటు వివిధ శాఖల అధికారులతో బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..విద్యుత్ వినియోగంలో నిర్దిష్ట పరిమితికి లోబడి వినియోగించిన కుటుంబాలకు విద్యుత్ బిల్లును మాఫీ చేయాలన్నారు. మహిళా సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని, గ్యాస్ కనెక్షన్లపై అందించే రాయితీలను సమర్థవంతంగా అమలు చేయాలన్నారు. పేదలకు సన్నబియ్యం అందించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. మహిళా సంఘాలు, స్వయం సహాయక సంఘాలకు రుణాల పంపిణీ వేగవంతం చేయాలని పేర్కొన్నారు. పక్కా ఇల్లు ప్రతీ కుటుంబానికి ఉండాలన్న లక్ష్యంతో చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. రాజీవ్ యువ వికాసం పథకం యువతను సామాజికంగా, ఆర్థికంగా ముందుకు తీసుకెళ్లే దిశగా ఉపాధి అవకాశాలు కల్పించాలని సూచించారు. ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తులను నిబంధనల ప్రకారం అర్హులైనవారికి వెంటనే సేవలు అందించాలని చెప్పారు. సమావేశంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, జిల్లా పరిషత్తు సీఈఓ జానకీరెడ్డి, వివిధ శాఖల అధికారులు జ్యోతి, జగదీశ్, చలపతిరావు, బాల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

సాగును ఆదాయాధారితంగా మలచుకోవాలి

ఏడీఏ భిక్షపతి



మాట్లాడుతున్న ఏడీఏ భిక్షపతి

జహీరాబాద్: రైతులు శాస్త్రీయ పద్ధతులను అవలంబించి తమ వ్యవసాయాన్ని ఆదాయాధారితంగా మలుచుకోవాలని వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ భిక్షపతి సూచించారు. మండలంలోని హుగ్గెల్లి గ్రామ రైతు వేదికలో బుధవారం వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మట్టి పరీక్షల అవసరం గురించి వివరించారు. భూసారాన్ని పెంచుకునేందుకు పచ్చిరొట్టె ఎరువుల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. శాస్త్రవేత్తల సలహాలు తీసుకుని పంటల నిర్వహణ చేపట్టాలన్నారు. కార్యక్రమంలో చిరుధాన్యాల పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్త అరుణ, మండల వ్యవసాయాధికారి లావణ్య, కేవీకే శాస్త్రవేత్తలు వరప్రసాద్, స్నేహలత, గోద్రేజ్ సంస్థ ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

భూ బాధితులకు బాసట



హరీశ్‌రావుకు స్వాగతం పలుకుతున్న గుమ్మడిదల నాయకులు

మాజీ మంత్రి హరీశ్‌రావు

జిన్నారం (పటాన్‌చెరు): గుమ్మడిదల భూ బాధితులకు అండగా ఉంటానని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు పేర్కొన్నారు. గుమ్మడిదల మున్సిపాలిటీ బీఆర్ఎస్ నాయకులు పొన్నాల శ్రీనివాసరెడ్డి సోదరుడు మధుసూదన్‌రెడ్డి వివాహ సందర్భంగా బుధవారం ఏర్పాటుచేసిన తేనేటి విందుకు నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డితో కలిసి హరీశ్‌రావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గుమ్మడిదల పరిధిలోని సర్వేనంబర్ 109 భూ బాధితులు వారి సమస్యలను హరీశ్‌రావుకు విన్నవించారు. భూ సమస్య పరిష్కారానికి తన సంపూర్ణ సహకారం అందిస్తామని భూ బాధితులకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, వెంకటేశంగౌడ్, కుమార్‌గౌడ్, బాల్‌రెడ్డి, సూర్యనారాయణ, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వామ్మో.. జూన్!

పిల్లల చదువు ఖర్చులకు తల్లిదండ్రులు బెంబేలు
- పేద, మధ్య తరగతికి భారంగా ఉన్న ప్రైవేటు స్కూలు ఫీజులు
- ఫీజుల నియంత్రణపై కొరవడిన పర్యవేక్షణ



జోగిపేట(అందోల్): జూన్ వచ్చిందంటే చాలు సామాన్య, మధ్య తరగతి కుటుంబీకులకు గుండె గుబేలుమంటుంది. ఈ నెలలోనే విద్యాసంస్థలు తెరచుకుంటాయి. ప్రైవేట్ పాఠశాలల్లో చదివించే విద్యార్థుల తల్లిదండ్రులకు ఫీజుల పెనుభారంగా మారుతున్నాయి. పిల్లలకు యూనిఫామ్, పాఠ్య, నోట్ పుస్తకాలు ఇతరత్రా అవసరాల కొనుగోలు లెక్కలు వేసుకుంటున్నారు. స్కూల్ ఫీజులు ఎంత?, యూనిఫామ్స్ ఖర్చు ఎంతవుతుంది? ఏ పాఠశాలలో చేర్పించాలి? యూనిఫామ్ కొనుగోలు, ఇంటినుంచి పాఠశాలకు పిల్లల రవాణా వంటి ఖర్చులతో సతమతమవుతుంటారు. తమ బిడ్డలను ప్రైవేట్ పాఠశాలల్లో చదివించాలన్న ఆత్యాశతో ఆయా వర్గాల తల్లిదండ్రులు అప్పులపాలు కావాల్సిన పరిస్థితులేర్పడుతున్నాయి.

కిండర్ గార్డెన్స్‌కే వేలకు వేలు

ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజులు వేలకు వేలు చెల్లించాల్సి ఉండగా, పట్టణ ప్రాంతాల్లో అయితే రూ.లక్షలు వసూలు చేస్తున్నాయి. ప్రభుత్వం ఫీజుల నియంత్రణపై చర్యలు తీసుకోకపోతుండటంతో ప్రైవేటు స్కూళ్ల యాజమాన్యాలు ఇష్టారీతిలో తల్లిదండ్రుల నుంచి ఫీజులను ముక్కు పిండి మరీ వసూలు చేస్తున్నాయి. ఎల్‌కేజీ, యూకేజీలల్లో చేర్పించాలంటే రూ.వేలకువేలు ఫీజులు చెల్లించాల్సి వస్తోంది. తప్పనిసరి కావడంతో తల్లిదండ్రులు అధిక ధరలను భరించి కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.

ఫీజుల కోసం అప్పులు

పిల్లల ఫీజుల కోసం పేద, మధ్య తరగతి కుటుంబాలు అప్పులు చేయాల్సిన పరిస్థితి నెలకొంటోంది. చేబదులు, వడ్డీకి రుణాలు తీసుకుంటున్నారు. ప్రైవేటు స్కూల్ ఫీజుల విషయంలో నర్సరీలోనే రూ.35 వేలకు పైగా చెల్లించాల్సి ఉండగా..కొంచెం పేరున్న ప్రైవేటు పాఠశాలల్లో ఫీజులు పెనుభారంగానే మారాయి. ఇద్దరు పిల్లలకు ఫీజులు చెల్లించాల్సి వస్తే రూ.లక్ష పైగానే జూన్లో సమకూర్చుకోవాల్సిన పరిస్థితులేర్పడ్డాయి. వీటికి తోడు ఇతరత్రా ఖర్చులు ఉండనే ఉన్నాయి.

ఫీజుల నియంత్రణపై చర్యలు తీసుకుంటాం



జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలు 1,351 పాఠశాలలున్నాయి. 423 ప్రైవేట్ పాఠశాలలు ఉన్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యాబోధన చేస్తున్నా ప్రైవేట్ వైపు కొంతమంది మొగ్గు చూపుతున్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల నియంత్రణపై చర్యలు తీసుకుంటున్నాం. అధిక ఫీజులు వసూలు చేసినట్లు తేలితే చర్యలు తీసుకుంటాం. జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో పుస్తకాలు పంపిణీ జరుగుతుంది.

–వెంకటేశ్వర్లు, జిల్లా విద్యాశాఖ అధికారి

క్లుప్తంగా

వైద్యుడికి మెమో జారీ

చేర్యాల(సిద్దిపేట): ఈ నెల 1న రాత్రి ఆస్పత్రికి వచ్చిన రోగుల పట్ల అనుచితంగా ప్రవర్తించాడని ఆరోపిస్తూ డాక్టర్ కల్యాణ్ చక్రవర్తిపై వచ్చిన ఫిర్యాదుపై డీసీహెచ్ విచారణ జరిపి బుధవారం వైద్యుడికి మెమో జారీ చేశాడు. మెమోను స్థానిక ఆస్పత్రి సూపరింటెండెంట్ దేవేందర్ వైద్యుడికి అందజేశాడు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ మాట్లాడుతూ ఉన్నతాధికారులు జారీ చేసిన మెమో వైద్యుడికి అందించామని, దీనిపై సదరు వైద్యుడు ఇచ్చిన వివరణ ఉన్నతాధికారులకు పంపించనున్నట్లు తెలిపారు.

చేపలు పట్టేందుకు వెళ్లి వ్యక్తి మృతి


మృతి చెందిన బాబు

చేగుంట(తూప్రాన్): చేపలు పట్టడానికి వెళ్లిన వ్యక్తి ప్రమాదవశాత్తు వలలో చిక్కుకొని వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మాసాయిపేట మండలం కొప్పులపల్లి వాగులో బుధవారం చోటు చేసుకుంది. ఎస్ఐ చైతన్యకుమార్‌రెడ్డి వివరాల ప్రకారం... తూప్రాన్ పట్టణానికి చెందిన జోగు బాబు(30) కొప్పులపల్లి వాగులో చేపలు పట్టడానికి వెళ్లాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు చేపల వల బాబుకు చుట్టుకొని నీటిలో మునిగి మృతి చెందాడు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా ఘటనా స్థలానికి చేరుకున్న ఎస్ఐ పంచనామా నిర్వహించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని రాజీపేటలో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుదాఘాతానికి గురై గేదె మృతి చెందింది. గ్రామానికి చెందిన బక్కుల యాదాగౌడ్ రోజు మాదిరిగా గేదెలను బుధవారం ఉదయం సైతం మేతకు వదిలాడు. గ్రామ సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్ వద్ద వైర్ తెగిపోయి ఉండటంతో అటుగా వెళ్లిన పాడిగేదె విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది. గేదె విలువ సుమారు రూ.60వేలు ఉంటుందని బాధితుడు తెలిపారు. కాగా వాటిని కాస్తున్న వ్యక్తి గమనించి దూరంగా వెళ్లడంతో ప్రమాదం తప్పింది.

వ్యక్తి అదృశ్యం


పాతులోతు సంతోష్

నర్సాపూర్ రూరల్: ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన ఆలస్యంగా బుధవారం వెలుగులోకి వచ్చింది. నర్సాపూర్ ఎస్సై లింగం కథనం ప్రకారం.. మండల పరిధిలోని తుల్జారంపేటకు చెందిన పాతులోత్ సంతోష్‌ను తండ్రి గోపాల్ పనిచేసిన కూలీ డబ్బులు ఇవ్వాలని మందలించాడు. దీంతో మనస్తాపం చెందిన అతడు మార్చి 9వ తేదీన సాయంత్రం ఇంటి నుంచి వెళ్లిపోయి తిరిగి రాలేదు. మరుసటి రోజు అతడు స్నేహితులకు ఫోన్ చేసి కొన్ని రోజులపాటు ఇంటికి వెళ్లనని చెప్పడంతో కుటుంబ సభ్యులు తిరిగి వస్తాడులే అనుకొని పోలీసులకు ఫిర్యాదు చేయలేదు. కొన్ని రోజులుగా ఫోన్ స్విచ్ ఆఫ్ రావడంతోపాటు వెతికినా ఆచూకీ లభించలేదు. తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి విక్రయిస్తున్న ముగ్గురు అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న సీఐ శ్రీను

చేర్యాల(సిద్దిపేట): గంజాయి విక్రయిస్తున్న ముగ్గురు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. బుధవారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్ఐ నీరేష్‌తో కలిసి సీఐ ఎల్.శ్రీను కేసు వివరాలు వెల్లడించారు. మండల పరిధిలోని రాంపూర్ గ్రామ శివారులో కొందరు వ్యక్తులు గంజాయి విక్రయిస్తున్నారన్న విశ్వసనీయ సమాచారం మేరకు సిద్దిపేట టాస్క్‌ఫోర్స్, చేర్యాల పోలీసులు రైడ్ చేసి సింగసారం మహేష్, రంగు రాజు, సార్ల నవీన్‌లను అరెస్టు చేశారు. వారిని విచారించగా హైదరాబాద్ దూల్‌పేటకు చెందిన గుర్తు తెలియని వ్యక్తి నుంచి కొనుగోలు చేసినట్లు చెప్పారు. వారి వద్ద నుంచి 100 గ్రాముల గంజాయి ప్యాకెట్లు, మూడుసెల్ ఫోన్‌లు స్వాధీనం చేసుకుని, నిందితులను రిమాండ్ తరలించినట్లు తెలిపారు.


వర్గల్ మండలం అంబర్‌పేటలో కుట్టిన విస్తర్లు ప్రదర్శిస్తున్న ఉపాధికూలీలు

మేము సైతం
పర్యావరణహితులం



మొక్కలు పెంచుతూ
ఆహ్లాదాన్ని పంచుతూ

- ప్లాస్టిక్ రహిత గ్రామాల కోసం కృషి చేస్తున్న ప్రకృతి ప్రేమికులు
- వినూత్నంగా ప్రచారం చేస్తూ పర్యావరణానికి మేలు
- ప్లాస్టిక్ వాడితే కలిగే అనర్థాలపై విస్తృత అవగాహన

నేడు ప్రపంచ పర్యావరణ దినం

ప్లాస్టిక్ పై అవగాహన కల్పిస్తూ పర్యావరణ పరిరక్షణకు పాటుపడుతున్నారు. భూమిపై ప్లాస్టిక్ వ్యర్థాలతో పొంచి ఉన్న ముప్పు గురించి ప్రజలు, రైతులు, విద్యార్థులకు పర్యావరణ ప్రేమికులు అవగాహన కల్పిస్తున్నారు. భవిష్యత్తు తరాలు బాగుండాలంటే పర్యావరణాన్ని పరిరక్షించాలని కోరుతున్నారు.

ఊరూరా.. ఉద్యమంలా

వర్గల్(గజ్వేల్): ప్లాస్టిక్ వినియోగం పెచ్చుమీరితే పర్యావరణానికి హానికరం. ఆకు విస్తర్లు కుడుతూ 'ప్లాస్టిక్ వాడకం వద్దు..ఆరోగ్యకరమైన, పర్యావరణ హితమైన విస్తరాకులు వాడుదామని సందేశమిస్తున్నారు వర్గల్ మండల మహిళలు. గ్రామాల్లో ఉపాధిహామీ కూలీలు, స్వయం సహాయక సంఘాల మహిళలు 'పర్యావరణ పరిరక్షణకు మేము సైతం' అంటూ ఆకు విస్తర్లు కుట్టి సిద్ధం చేసి పనిలో నిమగ్నమయ్యారు. సగటున ఒక్కో గ్రామ పంచాయతీ నుంచి కనీసం 50 విస్తరాకుల చొప్పున సిద్ధం చేసి ఈ నెల 6 నుంచి హుస్నాబాద్‌లో జరగనున్న రైతు సదస్సులో వీటిని వినియోగించి 'ప్లాస్టిక్ ప్లేట్లు వద్దు, పర్యావరణ హితం కోసం ఆకు విస్తర్లే ముద్దు' అని సందేశం పంపాలన్నది అధికారుల సంకల్పం. బుధవారం ఊరూరా విస్తర్లు కుట్టించే కార్యక్రమం చేపట్టామని వర్గల్ పంచాయతీ కార్యదర్శి సందీప్‌కుమార్ తెలిపారు.

వృత్తి వైద్యం.. ప్రవృత్తి చైతన్యం



సిద్దిపేటజోన్: ఆయన వృత్తి దంత వైద్యం.. ప్రవృత్తి మాత్రం పర్యావరణ పరిరక్షణకు కంకణం కట్టుకుని పట్టణ ప్రజలకు పరిచయమయ్యాడు డాక్టర్ డీఎస్ స్వామి. రసాయనిక ఎరువుల కూరగాయల వల్ల కలిగే అనర్థాల గూర్చి ప్రజల్లో అవగాహన కల్పించారు. స్వచ్ఛ బడిలో చెత్త పునర్వినియోగం, సేంద్రియ ఎరువుల తయారీ గూర్చి డిజిటల్ తరగతులు నిర్వహిస్తున్నారు. రసాయనిక ఎరువులు లేకుండా ఇంట్లో కూరగాయల పెంపకం గూర్చి చైతన్యపరిచారు. మిద్దె తోటల పెంపకం పేరిట అసోసియేషన్ ఏర్పాటు చేసి ఒక ప్లాట్ పామ్ ఏర్పాటు చేశారు.


మహిళకు వెండి నాణెం అందజేస్తున్న బాల్‌రెడ్డి(ఫైల్)

పదికిలోల ప్లాస్టిక్ తెచ్చి.. వెండి నాణెం తీసుకోండి

ములుగు (గజ్వేల్) : ప్లాస్టిక్‌ను ఎక్కడ పడితే అక్కడ వేయొద్దని చైత్యన్య పరుస్తూ పర్యావరణ పరిరక్షణకు నడుం బిగించాడు. ఆయనే ములుగు మండలం క్షీరసాగర్‌కు చెందిన కొన్యాల బాల్‌రెడ్డి. తమ గ్రామాన్ని ప్లాస్టిక్ రహిత గ్రామం వైపు నడిపించేందుకు కేబీఆర్ ఫౌండేషన్ ద్వారా 2023 ఏప్రిల్‌లో 10 కిలోల ప్లాస్టిక్ తెచ్చివ్వండి..10 గ్రాముల వెండి నాణెం తీసుకెళ్లండి అంటూ గ్రామస్తుల నుంచి సుమారు 1000 కిలోల ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించాడు. అందరి చేత భేష్ అనిపించుకున్నాడు.

కిలో ప్లాస్టిక్ సేకరణకు.. కిలో సన్నబియ్యం


గుజిరితండాలో ప్లాస్టిక్ తెచ్చిన వారికి సన్నబియ్యం ఇస్తున్న రాకేష్ (ఫైల్)

చిలప్‌చెడ్(నర్సాపూర్): గిరిజన తండాను ప్లాస్టిక్ రహిత తండాగా మార్చేందుకు అప్పటి యువ సర్పంచ్ 22 ఏళ్ల యువకుడు రాకేష్‌నాయక్ వినూత్నంగా ఆలోచించాడు. మండలంలోని గుజిరి తండా గ్రామ పంచాయతీలో విపరీతంగా వినియోగిస్తున్న ప్లాస్టిక్‌ను అరికట్టేందుకు పూనుకున్నాడు. ప్లాస్టిక్ వ్యర్థాలు సేకరించి తీసుకువచ్చిన వారికి కిలో ప్లాస్టిక్‌కు కిలో సన్న బియ్యం ఇస్తానని ప్రచారం చేశాడు. తండావాసులు సుమారు 110 కిలోల ప్లాస్టిక్ వ్యర్థాలు తీసుకొచ్చి, బదులుగా సన్న బియ్యం తీసుకెళ్లారు.

ఆ హెచ్‌ఎం పర్యావరణ ప్రేమికుడు

నేడు అవార్డు అందుకోనున్న రామకృష్ణ


స్టాప్ సింగిల్ యూస్ ప్లాస్టిక్‌పై విద్యార్థులకు అవగాహన

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): పర్యావరణ పరిరక్షణకు తన వంతు కృషి చేయాలనే లక్ష్యంతో పని చేస్తున్నాడు మండలంలోని నిజాంపూర్(కే) ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రామకృష్ణ. వృత్తి రీత్యా ఉపాధ్యాయుడు కావడంతో విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణపై ఇంటరాక్టివ్, ప్రాజెక్ట్ , ప్రయోగాత్మక పద్ధతుల్లో వినూత్నంగా బోధిస్తున్నాడు. అలాగే స్టాప్ సింగిల్ యూస్ ప్లాస్టిక్, ప్రమోటింగ్ ఆల్టర్నేటివ్ ఎనర్జీ రిసోర్సెస్, వాటర్ కన్సర్వేషన్, కంట్రోలింగ్ ఎయిర్ పొల్యూషన్, వేస్ట్ మేనేజ్మెంట్, ఎన్విరాన్మెంట్ ఎడ్యుకేషన్‌పై అవగాహన కల్పిస్తున్నారు. దీంతో ఆయన సేవలను గుర్తించిన ప్రభుత్వం రాష్ట్ర స్థాయి పర్యావరణ అవార్డుకు ఎంపిక చేసింది. నేడు హైదరాబాద్‌లో పీసీబీ రాష్ట్ర కార్యాలయంలో జరిగే కార్యక్రమంలో అవార్డును అందుకోనున్నారు.

సేంద్రియ కూరగాయల సాగు


మొక్కలకు రాఖీలు కడుతున్న నాగరాజు, కవిత దంపతులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పర్యావరణాన్ని కాపాడే దిశలో జిల్లా కేంద్రంలోని రాదారి నాగరాజు–కవిత దంపతులు ప్రయతిస్తూ ఇతరులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. వారి ఇల్లు ఒక చిన్నపాటి పంట చేను. పక్షులకు నీరు, తిండిగింజలు పెట్టడం, ఇంటి ముందు, టెర్రస్‌పై మొక్కలు పెంచుతూ పర్యావరణాన్ని కాపాడుతున్నారు. దంపతులిద్దరూ పర్యావరణానికి హాని చేయని ఎలక్ట్రికల్ వాహనాలనే వాడుతున్నారు. నాగరాజు దుబ్బాక మండలం లచ్చపేట మాడల్ స్కూలులో పీజీటీ ఆధ్యాపకుడిగా విధులు నిర్వహిస్తుండగా, కవిత గృహిని. సేంద్రియ కూరగాయలు పండిస్తున్నారు. అలాగే వీరికి ఇద్దరు పిల్లలు. వారి పుట్టిన రోజున, ఇతర ప్రత్యేక రోజుల్లో విరివిగా మొక్కలు నాటుతున్నారు.

ఉపాధిహామీ కూలీలతో 60 వేల విస్తరాకులు


మద్దూరులో విస్తరాకులు కుడుతున్న మహిళలు

హుస్నాబాద్‌రూరల్: రైతులకు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించడానికి జిల్లా పంచాయతీ అధికారి(డీపీఓ)దేవకి దేవి నూతన ఒరవడికి నాంది పలుకుతున్నారు. ఈ నెల 6,7,8 తేదీల్లో హుస్నాబాద్‌లో జరిగే కిసాన్ మేళాకు వచ్చే రైతులకు మోదుగ ఆకుల విస్తరిలో భోజనాలు పెట్టి పర్యావరణ ప్రాధాన్యతపై అవగాహన కల్పించేలా ముందుకు సాగుతున్నారు. జిల్లాలో 499 గ్రామ పంచాయతీల్లోని స్వశక్తి సంఘాల మహిళలు, ఉపాధిహామీ కూలీల సహకారంతో 60 వేల మోదుగ విస్తర్లను తయారు చేయిస్తున్నారు. కిసాన్ మేళాకు వచ్చే రైతులు, అతిథితులకు ప్లాస్టిక్‌కు బదులుగా మోదుగ ఆకుల విస్తర్లు, స్టీల్ ప్లేట్స్‌ను వాడనున్నారు. ప్లాస్టిక్ గ్లాస్‌లకు బదులు స్టీల్ గ్లాస్‌లను వినియోగించడంతో 2లక్షల ప్లాస్టిక్ గ్లాస్‌ల వాడకం తగ్గించనున్నారు. ఇప్పటికే మహిళా సంఘాల వద్ద ఉన్న స్టీల్ బ్యాంకును కిసాన్ మేళాల్లో వినియోగించడానికి సిద్ధమవుతున్నామని డీపీఓ తెలిపారు.

మోదుగు ఆకులతో విస్తరాకుల తయారీ



మద్దూరు(హుస్నాబాద్): పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఉపాధి హామీ కూలీలు మరియు మహిళా సంఘాల సభ్యులు విస్తరాకులను తయారు చేశారు. బుధవారం మద్దూరు, ధూళ్మిట్ట మండలాల పరిధిలోని గ్రామాల్లో ఉపాధి హామీ కూలీలు మోదుగు ఆకులతో విస్తరాకులు తయారు చేశారు. హుస్నాబాద్‌లో నిర్వహించనున్న కిసాన్ మేళాలో వినియోగించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రామ్మోహన్, ఈసీ పరశరాములు, ఎంపీఓ వెంకటేశ్వర్లు, ఏపీఎం బాబు రావు , పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

గ్రీన్ సిద్దిపేట


సిద్దిపేట మున్సిపాలిటీలో స్టీల్ బ్యాంక్

సిద్దిపేటజోన్: పర్యావరణ పరిరక్షణకు సిద్దిపేట మున్సిపాలిటీ గత పదేళ్లుగా అలుపెరుగని కృషి చేస్తోంది.
- 2015లో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం హరితహారం కింద తొమ్మిది విడతల్లో సిద్దిపేట మున్సిపాలిటీలో సుమారు పదిలక్షల మొక్కలు నాటారు.
- గ్రీన్ సిద్దిపేట అవార్డును సొంతం చేసుకుంది.
- ప్లాస్టిక్ ఫ్రీ పట్టణంగా మార్చే దిశలో 2020 జూన్‌లో బల్దియాలో వినూత్న రీతిలో ఇప్పటివరకు 34 వార్డుల్లో స్టీల్ బ్యాంక్ ఏర్పాటు చేశారు.
- ఐదేళ్ల క్రితం సిద్దిపేట బల్దియాలో రుతు ప్రేమ పేరిట శానిటరీ ప్యాడ్స్ స్థానంలో మహిళలకు ప్రత్యేకంగా క్లాత్ ప్యాడ్స్ ఉచితంగా పంపిణీ చేసింది. పట్టణంలో ప్లాస్టిక్ కవర్ల నిషేధం ప్రకటించి, పెద్ద ఎత్తున ప్రజల్లో అవగాహన కల్పించింది.

మొక్కలు పెంచుతూ.. ఆదర్శంగా నిలుస్తూ..


డ్రాగన్‌ఫ్రూట్ చెట్టుతో విజయ్‌కుమార్

జహీరాబాద్ : మొగుడంపల్లి మండలంలోని పర్వతాపూర్ గ్రామానికి చెందిన విజయ్‌కుమార్‌కు మొక్కలు అంటే ఇష్టం. అటు వ్యవసాయం చేస్తూనే మూడు దశాబ్దాలుగా మొక్కలు పెంచుతున్నారు. వేసవిలోనూ తన ఇంట్లో చల్లని వాతావరణం ఉంటోందని పేర్కొన్నాడు. పండ్లు, పూల మొక్కలు తదితర వాటితోపాటు పలు రకాల మొక్కలు, కూరగాయలను పెంచుతూ పర్యావరణాన్ని కాపాడుతున్నాడు.

రెండు బైకులు ఢీ.. ఒకరి మృతి

నర్సాపూర్ రూరల్: రెండు బైకులు ఎదురు ఎదురుగా ఢీకొని ఒకరు మృతి చెందగా, మరో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ ఘటన నర్సాపూర్ – వెల్దుర్తి రహదారిలోని లింగాపూర్ వద్ద బుధవారం సాయంత్రం జరిగింది. ఎస్సై లింగం వివరాల ప్రకారం... శివ్వంపేట మండలం పిలుట్ల గ్రామానికి చెందిన మాజీ ఉపసర్పంచ్ నాయిని దామోదర్ రెడ్డి (70) బైక్‌పై అదే గ్రామానికి చెందిన బబ్బురి రాములుతో కలిసి సొంత పని నిమిత్తం నర్సాపూర్ వస్తున్నాడు. ఈ క్రమంలో లింగాపూర్ పంచాయతీ పరిధిలోని జగ్యాతండాకు చెందిన చెన్న నాయక్ లింగాపూర్ సమీపంలో ఎదురుగా వచ్చి బైక్‌తో ఢీకొట్టాడు. దీంతో దామోదర్ రెడ్డి అక్కడికక్కడే మృతి చెందగా, బైక్‌పై వెనకాల కూర్చున్న రాములుకు తీవ్ర గాయాలయ్యాయి. చెన్న నాయక్‌కు సైతం తీవ్ర గాయాలు కాగా వారిద్దరిని అంబులెన్స్‌లో నర్సాపూర్ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కారు, ద్విచక్రవాహనం ఢీ.. ఇరువురికి గాయాలు

కొమురవెల్లి(సిద్దిపేట): కారు, ద్విచక్రవాహనం ఢీకొన్న ప్రమాదంలో ఇరువురికి గాయాలయ్యాయి. ఈ ఘటన మండలంలోని మర్రిముచ్చాల గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... చేర్యాల పట్టణానికి చెందిన కాటం శ్రీనివాస్, అతని మనువరాలు అక్షిత తమ సొంత పనుల నిమిత్తం ద్విచక్రవాహనంపై మర్రిముచ్చాలకు వచ్చారు. రోడ్డు దాటుతున్న క్రమంలో దుద్దెడ వైపునుంచి వస్తున్న కారు ఢీకొట్టడంతో ఇరువురికి తీవ్రగాయాలయ్యాయి. మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించినట్లు తెలిపారు.

కారు, బైక్ ఢీకొన్న ప్రమాదంలో యువకుడు..

దుబ్బాకటౌన్: ఎదురెదురుగా వస్తున్న ద్విచక్ర వాహనం, కారు ఢీకొని యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన రాయపోల్ మండల పరిధిలోని కొత్తపల్లి బస్ స్టాప్ సమీపంలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. దౌల్తాబాద్ మండల కేంద్రానికి చెందిన జీర్కపల్లి నరేందర్ (22) కుకునూరుపల్లి మండల కేంద్రంలో ఫ్లెక్సీ షాప్ నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం రాత్రి పనులు ముగించుకుని ఇంటికి బయలు దేరాడు. ఈ క్రమంలో కొత్తపల్లి బస్‌స్టాప్ సమీపంలోకి రాగానే గజ్వేల్ వైపు వెళుతున్న కారు ఎదురెదురుగా వస్తున్న బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న నరేందర్ తీవ్రగాయాల పాలయ్యాడు. స్థానికులు చికిత్స నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అతడు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. నిర్లక్ష్యంగా కారు నడిపిన వ్యక్తిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు.

అవయవదానం మరొకరికి ప్రాణదానం


పార్థసారథి (ఫైల్)

జిన్నారం (పటాన్‌చెరు): మరో మనిషి ప్రాణాలను బతికించే అవయవదానం గొప్పది. ఈ నెల 1న సంగారెడ్డి మండలం ఇస్మాయిల్ ఖాన్‌పేట్ గ్రామానికి చెందిన పార్థసారథి (37)అనే వ్యక్తి జిన్నారం మండలంలోని ఊట్ల గ్రామ శివారు రైస్‌మిల్ చౌరస్తా వద్ద రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలై పడి ఉన్నాడు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వెంటనే అంబులెన్స్‌లో సురారంలోని మల్లారెడ్డి నారాయణ ఆస్పత్రికి తరలించారు. వైద్య పరీక్షలు నిర్వహించిన వైద్యులు ప్రమాదంలో తలకు బలమైన గాయాలు కావడంతో బ్రెయిన్‌డెడ్ అయి మృతి చెందినట్లు వెల్లడించారు. మరొకరి ప్రాణాలు కాపాడేందుకు భర్త అవయవాలు ఉపయోగపడతాయని తెలుసుకున్న భార్య మమత అయవయ దానానికి అంగీకరించింది. భర్త కళ్లు, గుండె, కిడ్నీలను దానం చేశారు. దీంతో మృతుడి కుటుంబ సభ్యులను ఆస్పత్రి యాజమాన్యం అభినందించింది. మృతుడి పార్థివదేహానికి సెల్యూట్ చేశారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

- పూజలకు వచ్చిన బంధువులు అంత్యక్రియల్లో పాల్గొన్న పరిస్థితి
- కౌడిపల్లి మండలం పీర్యతండాలో ఘటన


సెనావత్ శంకర్(ఫైల్)

కౌడిపల్లి(నర్సాపూర్): తండాలో పూజల కోసం వచ్చిన బంధువులు దురదృష్టవశాత్తు ఆహ్వానించిన వ్యక్తి అంత్యక్రియల్లో పాల్గొనాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ ఘటన మండలంలోని భుజిరంపేట పీర్యతండాలో బుధవారం జరిగింది. స్థానిక ఎస్ఐ రంజిత్‌రెడ్డి వివరాల ప్రకారం.. పీర్యతండాలో మంగళవారం తండావాసులు ప్రతి ఏడాది మాదిరిగా జగదాంబదేవి ఆలయంలో వార్షిక పూజలు నిర్వహించారు. పూజల సందర్భంగా తండాకు చెందిన సెనావత్ శంకర్(48)సైతం బంధువులను పిలుచుకొని ఉత్సాహంగా పూజల్లో పాల్గొన్నారు. కాగా బుధవారం ఇంటిలో నీళ్ల లేవని పక్కనే ఉన్న వ్యవసాయ బోరువద్ద మోటర్ ఆన్ చేద్దామని వెళ్లాడు. ఇంతలో బోరువద్ద విద్యుదాఘాతంతో కొట్టుకుంటున్నాడు. కొద్ది దూరంలో ఉన్న తండాకు చెందిన సెనావత్ సురేష్ గమనించి కర్రతో వైర్‌ను కొట్టి కరెంట్‌షాక్‌ను తొలగించారు. అతడు శంకర్‌ను ఎత్తుకుని ఇంటికి తీసుకొచ్చి కుటుంబ సభ్యులకు విషయం చెప్పి చికిత్స నిమిత్తం కౌడిపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన డాక్టర్ మెరుగైన చికిత్సకు మెదక్‌కు రెఫర్ చేసాడు. మెదక్ ప్రభుత్వ ఆస్పత్రిలో పరీక్షించిన వైద్యులు శంకర్ అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. సంతోషంతో పూజలకు వచ్చిన బంధువులు అంత్యక్రియల్లో పాల్గొనాల్సి రావడంతో తండాలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతుడికి భార్య రేణుక ఇద్దరు కుమారులు, ముగ్గురు కూతుళ్లు ఉన్నారు.

చికిత్స పొందుతూ భర్త మృతి

శివ్వంపేట, పాపన్నపేట : ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన దంపతుల్లో భర్త మృతిచెందిన ఘటన బుధవారం రాత్రి చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. మండల పరిధిలోని పోతులబోగూడ గ్రామానికి చెందిన పందుల శివకుమార్(40) అతడి భార్య శోభ మంగళవారం పాపన్నపేట మండలం ఏడుపాయల్లో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. గుర్తించిన స్థానికులు చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం రాత్రి శివకుమార్ మృతి చెందాడు. అతడి భార్య శోభ ఐసీయూలో చికిత్స పొందుతుంది.

రాళ్ల భూములు.. నల్ల రేగళ్లు

- పూడిక మట్టి వేసుకుంటున్న రైతులు
- ఆర్థికంగా భారమైనా ముందడుగేస్తున్న అన్నదాతలు
- భూసార పరీక్షలు చేయించి వేస్తే మేలు
- మారుతున్న భూముల రూపురేఖలు

కంగ్టి(నారాయణఖేడ్): రాళ్లతో కూడిన గట్టు భూములు, చెలుక మట్టి, ఎర్ర రేగడి భూములు పూడిక మట్టితో నల్లరేగడి భూములుగా మారుతున్నాయి. ఖేడ్ డివిజన్‌లో కంగ్టి, సిర్గాపూర్, నాగల్‌గిద్ద, మనూరు, నారాయణఖేడ్ మండలాల్లో అధికంగా రాళ్ల రప్పలతో కూడిన భూములున్నాయి. గతంలో పూడిక మట్టి తోడాలంటే భయపడే రైతులు గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన మిషన్ కాకతీయ పథకం పుణ్యమా అని వచ్చిన అవకాశం వదులు కోకుండా భూముల రూపురేఖలు మార్చేస్తున్నారు.

ఎకరాకు దాదాపు లక్ష ఖర్చు..

చెరువులోని పూడిక మట్టి కోసం దూరాన్ని బట్టి, జేసీబీతో లోడింగ్ సహా ప్రతీ ట్రిప్పు టిప్పర్‌కు రూ.2500 నుంచి రూ.3వేల వరకు చెల్లిస్తున్నట్లు రైతులు తెలిపారు. దీంతో ఎకరా విస్తీర్ణంలో దాదాపు 35 నుంచి 40 ట్రిప్పులు వేయిస్తున్నారు. ఇది వ్యవసాయాధికారులు సూచించిన దాని కంటే దాదాపు ఐదింతలు అధికంగా ఉంటుంది. దీంతో భూములకు లక్షల రూపాయలు ఖర్చు చేసి సారవంతంగా మారుస్తున్నారు. మండలంలోని దామర్‌గిద్ద కాకివాగు ప్రాజెక్టు, ముర్కుంజాల్ సాములు వాగు ప్రాజెక్టు, తడ్కల్ పెద్ద చెరువు, ఘన్‌పూర్ చెరువు, చాప్టా కొత్త చెరువులలోని పూడిక మట్టిని రాళ్ల భూములకు తరలిస్తున్నారు.

భూసార పరీక్షల ఆధారంగా పూడిక మట్టి వేసుకోవాలి

రైతులు భూముల్లో పూడిక మట్టి వేసే ముందు భూసార పరీక్షలు చేయించుకొని పోషకాలకు అనుగుణంగా వేసుకోవాలని ఏడీఏ తెలిపారు. రైతులకు కింది సూచనలు చేశారు.
- చెరువు మట్టి చేనుకు బలమే అయినా ఎకరాకు 20 నుంచి 25 ట్రాక్టర్ ట్రిప్పులు మాత్రమే వేసుకోవాలి.
- ముఖ్యంగా ఎండాకాలం మే నెలలో మాత్రమే పూడిక మట్టి చెరువులో రెండు నుంచి మూడు అడుగులు మాత్రమే తోడాలి.
- విచ్చలవిడి రసాయన ఎరువుల వాడకంతో భూమిలో పోషకాల లోపం విపరీతంగా కన్పిస్తుంది.
- రసాయన ఎరువుల కన్నా పూడికలో పోషకాలు మెండు.
- పూడికతో నీటి నిల్వ సామర్థ్యం 4 నుంచి 7 శాతం పెరుగుతుంది.
- పూడిక వేయడంతో పంటలకు రోగ నిరోధక శక్తి పెరగడంతో పాటు మిత్ర పురుగులు పెరిగి పంట దిగుబడులు అధికంగా వస్తాయి.


రాళ్లు,రప్పలతో నిండిన వ్యవసాయ భూములు


పూడిక మట్టితో రేగడి భూములను తలపిస్తున్న నేలలు

లోపిస్తున్న పోషకాల సమతుల్యత



పంటలకు కావాల్సిన ప్రధాన పోషకాలు భాస్వరం, నత్రజని, పొటాష్ నిల్వలు చెరువు పూడిక మట్టిలో పుష్కలంగా ఉన్నాయి. రైతులకు పూడిక మట్టి అందుబాటులో ఉండటంతో తమ ఇష్టానుసారంగా రాళ్లు, చెలుకలు, చౌడు భూముల రూపు రేఖలు మారుస్తూ నల్లరేగడి నేలలుగా మారుస్తున్నారు. మండలంలో గట్టు భూములు అధికంగా ఉండటంతో తేమను నిల్వ ఉంచే సామర్థ్యం తక్కువగా ఉంటుంది. దీంతో పంటల దిగుబడి సక్రమంగా రావడం లేదని రైతులు భూముల్లో రెండు అడుగుల ఎత్తు వరకు రేగడి పూడిక మట్టిని వేస్తున్నారు. అధిక దిగుబడులు సాధించేందుకు రైతులు పోటీ పడటం మంచి పరిణామం. అయినా అధిక మోతాదులో పూడిక మట్టి వేయడం వల్ల పోషకాల సమతుల్యత లోపించి పంటలకు నష్టం కూడా జరిగే ప్రమాదం లేకపోలేదు. – నారాయణఖేడ్, ఏడీఏ నూతన్‌కుమార్